






పవన్‌కు ఉగాది పచ్చడి తినిపిస్తున్న వర్మ

పవన్‌తో రఘురామరాజు భేటీ

ఉభయ గోదావరి జిల్లాల్లో చంద్రబాబు, పవన్ రోడ్ షో

- నేడు తణుకు, నిడదవోలులో ఉమ్మడిగా రోడ్ షో
- రేపు అంబాజీపేట, అమలాపురంలో బహిరంగ సభలు
- అమలాపురం పర్యటనకు విడుదల కాని పవన్ షెడ్యూల్



రాజమహేంద్రవరం/ అమలాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం,జనసేన పార్టీల అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఉమ్మడిగా రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం చంద్రబాబు, పవన్ రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మీదుగా నిడదవోలు చేరుకుంటారు. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో రాత్రి 7 గంటలకు రోడ్ షో నిర్వహిస్తారు.సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు.అనంతరం చంద్రబాబు నిడదవోలులోని తిరుమల సాయి కల్యాణమండపంలో రాత్రి బసచేస్తారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బసచేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా నేతలతో నిడదవోలులో సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం 2 గంటలకు బయలుదేరి చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.25 గంటలకు అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగుతారు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన ఇంకా షెడ్యూలు విడుదల కాలేదు. ఆయన కూడా ప్రత్యేక హెలికాప్టర్‌లో అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో దిగనున్నారు. చంద్రబాబు హైస్కూలు గ్రౌండ్ నుంచి 3.30 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు అంబాజీపేట నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ 4 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారు. గంటన్నర సేపు జరిగే సభ అనంతరం రోడ్డు మార్గాన అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తారు. 8.45 గంటలకు సభ ముగిసిన తరువాత చంద్రబాబు కిమ్స్ వైద్యకళాశాల గ్రౌండ్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు.ఇప్పటికే నిడదవోలు, అంబాజీపేటలో పర్యటనకు సంబంధించి టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కందుల దుర్గేష్, రెడ్డి సుబ్రహ్మణ్యం, నిమ్మల రామానాయుడు, కొత్తపల్లి సుబ్బారాయుడు,గన్నవరం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ,జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, గణపతి వీరరాఘవులు ఏర్పాట్లపై సమీక్షించారు.

పవన్ కేరాఫ్ పిఠాపురం!

- ఇక్కడి నుంచే కూటమి విజయ ప్రస్థానం
- రాబోయే ఎన్నికల్లో కూటమిదే ప్రభుత్వం
- చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం
- నివాసం, జనసేన కార్యాలయం ఇక్కడే
- ఉగాది వేడుకల్లో జనసేనాని.. పచ్చడి తినిపించిన వర్మ
- వేదపండితులకు సత్కారం
- హైదరాబాద్‌కు పయనం



కొత్త ఇంటి వద్ద పవన్‌కు మహిళల హారతి



పంచాంగాలు ఆవిష్కరిస్తున్న పవన్



జ్ఞాపిక అందిస్తున్న వర్మ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి),పిఠాపురం,గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 9 : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పురుహూతిక అమ్మవారి దయ, శ్రీపాదశ్రీవల్లభుడు, బంగారుపాపమ్మ ఆశీస్సులు, దీవెనలతో పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అందరి మద్దతుతో కూటమి ప్రభుత్వం ఇక్కడి నుంచే విజయప్రస్థానం సాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చేబ్రోలులో హైవేను ఆనుకుని ఉన్న ఇంట్లో పవన్ నూతన గృహ ప్రవేశం చేసి మాట్లాడారు. ఈ ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరరావు దంపతులు, వారి పిల్లలు రెండేళ్ల కిందట మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చారని గుర్తు చేశారు. అప్పుడు వీరంతా తనను పిఠాపురం నుంచి పోటీ చేయాలని కోరారని, కానీ అప్పుడు తాను అంతగా ఆలోచించలేదన్నారు. ఒక నియోజకవర్గం నుంచి తనను పోటీ చేయాలని ఇంత మంది కోరుకుంటారని అనుకోలేదన్నారు. ఆ రోజున పిఠాపురం ప్రజల గొంతుని, ఆకాంక్షని ఆ తల్లి(పురుహూతికాఅమ్మవారు) ఓదూరి దంపతుల ద్వారా నా దృష్టికి తీసుకువచ్చిందని ఇప్పుడు భావిస్తున్నానన్నారు.శ్రీక్రోధి నామసంవత్సరంలో రాష్ట్రంలో మార్పునకు పిఠాపురం నుంచే శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు.చేబ్రోలులో ఉన్న గృహమే ఇకపై తన నివాసమని, ఇక్కడే జనసేన కార్యాలయం ఉంటుందని ప్రకటించారు.ఈ ఏడాది అంతా క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు.తన కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్న టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులకు అభినందనలు చెప్పారు. కొత్త ఇంటిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్, బీజేపీ నేత కృష్ణంరాజులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలకు సమయం దగ్గరపడడంతో ప్రచారాన్ని పెంచే అంశంపై చర్చించారు.అనంతరం నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఆ తర్వాత నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు పవన్‌తో భేటీ అయ్యారు.రఘురామ పోటీచేసే స్థానం ఏంటనే దానిపై ఇరువురు చర్చించుకున్నారు. సమావేశాలు ముగించుకుని మధ్యాహ్న భోజనం అనంతరం మధ్యాహ్నం 3.18 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్ నుంచి పవన్ హైదరాబాద్ బయలుదేరారు.కార్యక్రమాల్లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి,నేతలు వేములపాటి అజయకుమార్,మర్రెడ్డి శ్రీనివాస్, కల్యాణం శివ శ్రీనివాస్,ఎన్.శంకరగౌడ్, యాతం నగేష్,ఏవీ రత్నం, బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం

పవన్ చేబ్రోలులో తీసుకున్న ఇంట్లో మంగళవారం గృహ ప్రవేశం చేశారు. హైదరాబాదు నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరిన పవన్ మంగళవారం ఉదయం 10.07 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గాన చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నివాసానికి చేరుకున్నారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి పవన్‌ను ఆహ్వానించారు. గృహప్రవేశం అనంతరం ఇంట్లో పవన్ పూజలు చేశారు. ఇంట్లో మూడు అంతస్తులను తిరిగి చూసి అదే ఆవరణలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లతో కలిసి పాల్గొన్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. పవన్‌కల్యాణ్‌కు వేద ఆశీర్వచనాలు పలికి సత్కరించారు. అనంతరం వేదపండితులను పవన్ సత్కరించి పంచాంగాలు అందజేశారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సతీమణి లక్ష్మీదేవితో కలిసి ఉగాది పచ్చడిని పవన్‌కు తినిపించారు.అనంతరం వెండి గ్లాసుల సెట్, ఉగాది పచ్చడిని ప్రత్యేక డబ్బాలో ఉంచి వర్మ పవన్‌కు అందించారు.వెంకటేశ్వరస్వామి ఫొటోను అందించారు. బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు దంపతులతో ఫోటో దిగారు. ఉగాది వేడుకలకు కూటమి నాయకులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారు.మల్లాం, ఎఫ్‌కేపాలెం మాజీ సర్పంచ్‌లు కుంపట్ల చెల్లారావు, జవ్వాది జోగేశ్వరరావు ధాన్యం కుచ్చులను పవన్‌కు అందజేశారు.పట్టణానికి చెందిన కవి గౌరినాయుడు తాను రచించిన పుస్తకాలు, అవంత్స సోమసుందర్ రచనలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.భానుప్రసాద్ చెక్కతో తయారు చేయించిన ఎడ్లబండి,అందులో రైతు, జనసేన జండాలతో కూడిన జ్ఞాపిక తెచ్చారు.



తమ్ముడి వెంట : ఉగాది వేడుకలకు హాజరైన నాగబాబు తదితరులు



తరగని అభిమానం : చేబ్రోలులో పవన్ నివాసం వద్ద అభిమానుల కోలాహలం



పవనాభిమానం : పవన్‌కు జ్ఞాపిక.. పవన్‌తో ఫొటో

గుండెల నిండా పవన్

ఆలయాలకు ఉగాది శోభ

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం

శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో వేడుకలు



పాదగయ క్షేత్రంలో పంచాంగ శ్రవణం

పిఠాపురం, ఏప్రిల్ 9: పిఠాపురంలోని ఆలయాలు ఉగాది శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి. వేదపండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అర్చకులు, వేదపండితులను ఆలయ ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి సత్కరించి పంచాంగాలు, విసనకర్రలు అందజేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో క్రోధి నామ సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. శ్రీపాదశ్రీవల్లభుడికి లక్ష బిల్వార్చన, పుష్పార్చన జరిగాయి. అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని జైగణేష్ దేవస్థానం, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, టీటీడీ నిర్వహణలోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పంచాంగ శ్రవణం

నేడు విజిలెన్స్ విచారణ

సామర్లకోట, ఏప్రిల్ 9: సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టుల భర్తీలో ముడుపులు చేతుల మారాయన్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడంతో అమరావతి విజిలెన్స్ ఉన్నతాధికారుల బృందం బుధవారం ఇక్కడికి చేరుకుని సమగ్ర దర్యాప్తు నిర్వహించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండు సబ్‌స్టేషన్లలోనూ నలుగురు చొప్పున ఎనిమిది మంది షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ పోస్టులు ఆశిస్తున్న వారి వద్ద నుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ముడుపులు అందుకున్నట్లు సమాచారం. అయితే డబ్బులు ముట్టచెప్పినా తమకు పోస్టులు అప్పగించలేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం అమరావతి నుంచి విజిలెన్స్ ఉన్నతాధికారులు చేరుకుని క్షేత్రస్థాయిలో దర్యాప్తు నిర్వహించనున్నారు.

జిల్లా ప్రజల జీవితాల్లో సంతోషాలు నిండాలి



కళాకారులను అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

- ఉగాది వేడుకల్లో కలెక్టర్ నివాస్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేద పండితులకు సత్కారం



తబలా వాయిస్తున్న అజయ్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 9: శ్రీక్రోధి నామ సంవత్సరంలో జిల్లాలో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆకాంక్షించారు. కాకినాడ సూర్య కళా మందిరంలో మంగళవారం జిల్లా సాంస్కృతిక మండలి, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్తంగా శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ తొలి పండుగ ఉగాదిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు.

అలరించిన నాద స్వరం

పసుపులేటి వెంకటరమణ బృందం స్వరనాదం అలరించింది. వేద పండితులు కప్పగంతుల చంద్రశేఖరశాస్త్రి అవధాని, బులుసు అయ్యప్ప శాస్త్రి అవధాని, కంధాళం సూర్యనారాయణశాస్త్రి అవధాని, కొండూరి ఆంజనేయశాస్త్రి అవధాని వేదగానం చేసి అతిథులకు ఆశీర్వచనం అందించారు. వక్కలంక రామకృష్ణమ్మ సిద్ధాంతి సంప్రదాయ పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

విశేషంగా అలరించిన తబలా

కార్యక్రమంలో అజయ్ తబలా వాయిద్య విన్యాసంతో ఆకట్టుకున్నారు. తలారి ఆనంద్, కాకినాడ జిల్లా సమాచార శాఖ పీఆర్వో అజయ్ బృందం క్రోధి నామ ఉగాదికి స్వాగతం సుస్వాగతం, నవరాగాల కోయిల పాటకు, యువత మేలుకో రాష్ట్ర ప్రగతికై నీ ఓటు వాడుకో అంటూ ఆలపించిన గీతాలు అలరించాయి.


సాంస్కృతిక కార్యక్రమాలు అదుర్స్

గీతం స్కూల్ విద్యార్థిని శ్రీకిరణ్, సెయింట్ పీఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థినులు నిహారిక, నిరుపమ చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. కొరుప్రోలు గౌరీనాయుడు, మార్ని జానకిరామ చౌదరి, అద్దేపల్లి జ్యోతి, కొత్త అప్పారావు, నాగజ్యోతిశేఖర్, ఇందిర, సూర్యభాస్కర్, ప్రసాద్‌లు చేసిన వసంత కవితా గానం అలరించింది.

వేద పండితులకు గౌరవ సత్కారం

వేద పండితులు, పంచాంగ పండితులు, అర్చక స్వాములు, కవులు, కళాకారులను జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, జిల్లా దేవదాయశాఖ అధికారి నారాయణమూర్తి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సమాచార డీడీ నాగార్జున, ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తాత్విక జ్ఞానంతో శాంతి, సహనం



ఆధ్యాత్మిక ప్రవచనం అందిస్తున్న ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఏప్రిల్ 9: ఆధునిక యాంత్రిక యుగంలో ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా శాంతి, సహనం అలవడుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉగాది సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ప్రతి ఒక్కరు సంవత్సరంలో కనీసం 12 మొక్కలు నాటడం ద్వారా మన ప్రాంతాలను నందనవనాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మొక్కను భగవత్ స్వరూపంగా భావించాలని చెప్పారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు అందజేశారు. మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, షేక్ బాహుజీ, చిందాడ చిన్నోడు, రాంభట్ల నృసింహశర్మ, యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన భక్తులు



కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడిగా తుమ్మల బాబు



పెద్దాపురం, ఏప్రిల్ 9 : కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా తుమ్మల రామస్వామి (బాబు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన తుమ్మల బాబు గతంలో ప్రజారాజ్యంలో జిల్లా యువరాజ్యం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. తనపై ఎంతో నమ్మకంతో అధినేత అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించనున్నట్లు బాబు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాబుకు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.



పవన్‌తో జగ్గంపేట నియోజకవర్గ నూతన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్

కాకినాడ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు



పవన్‌తో సుధీర్

పిఠాపురం, ఏప్రిల్ 9: జనసేన పార్టీలో పలు కమిటీలు నియమిస్తూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసంలో మంగళవారం జిల్లాకు చెందిన ముఖ్యనేతలు, రాష్ట్ర పార్టీ నాయకులతో సమావేశం అనంతరం పార్టీ కాకినాడ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీకి కార్యదర్శిగా కాకినాడ నగర పార్టీ అధ్యక్షుడు డాక్టర్ తోట సుధీర్ వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మల్లాడి రాజేంద్ర, టీవీ రామారావు, చిక్కాల దొరబాబు, నల్లా శ్రీధర్, దేవు మధువీరేష్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా ఉన్న పాటంశెట్టి సూర్యచంద్రను ఆ పదవి నుంచి తొలగించారు, నూతన ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి రమేష్‌ను నియమిస్తూ పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు.



నూతన ఆలయం

తలుపులమ్మ దర్శన భాగ్యం

కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ లోవలో అమ్మవారి స్వయంభూ దర్శన భాగ్యం భక్తులకు కలిగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి దర్శనాన్ని బుధవారం నుంచి పునరుద్ధరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వార్త..7వ పేజీలో

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు

● శ్రీసిద్ధివినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధివినాయకుడు, లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అయినవిల్లి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలి పూజలు అందుకునే దైవం, విఘ్నాలు నివారించే విఘ్నేశ్వరుని నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా స్వామిని దర్శించుకుంటే విఘ్నాలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దాంతో అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అయినవిల్లి ఆలయం కిక్కిరిసింది. రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లు, ఆలయ మండపం భక్తులతో కిక్కిరిశాయి. దర్శనానికి గంటల కొద్దీ భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది సేవలు అందించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్నసమారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

ఆదాయం 2.. వ్యయం 14

● శ్రీ క్రోధి నామసంవత్సరంలో ఇదీ సత్యదేవుడి లెక్క
● అన్నవరంలో వేదపండితుల పంచాంగ శ్రవణం
● పండితులకు సత్కారం ● వెండి రథంపై ఊరేగింపు



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో, చైర్మన్

అన్నవరం, ఏప్రిల్ 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం క్రోధి నామసంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడు మ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేకవేదికపై ఆశీనులు గావించారు. ప్రత్యేకపూజలు అనంతరం దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాఠి పంచాంగ శ్రవణం పఠించారు. మఖ నక్షత్రం, సింహరాశి కలిగిన సత్యదేవుడికి ఈఏడాది ఆదాయం 2, వ్యయం 14 ఉందని దీనిద్వారా భక్తులకు క్రోధి నామసంవత్సరంలో భక్తుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈఏడాది అన్నివర్గాల ప్రజలకు అనుకూలత లభిస్తుందన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐదుగురు పండితులను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు ఘనంగా సత్కరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 10గంటలకు వెండిరథంపై స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు పండితుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రాత్రి 7గంటలకు వెండిగజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ముద్రించిన పంచాంగంను ఉచితంగా పంపిణీ చేశారు. సత్యదేవుడి సన్నిధిలో ఏర్పాటుచేసిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. పలువురు భక్తులు వీటివద్ద స్వీయచిత్రాలు దిగడం విశేషం. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన గర్భాలయంలో
తలుపులమ్మ దర్శనం

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ తల్లి

తునిరూరల్, ఏప్రిల్ 9: తలుపులమ్మ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. 15నెలలుగా ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా దిగువ బాలాలయంలో భక్తులను అనుగ్రహిస్తున్న తలుపులమ్మ అమ్మవారు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇప్పటికే పూర్తయిన ప్రధాన గర్భాలయంలో భక్తులకు దర్శనమిచ్చే విధంగా ఏర్పాట్లు చేయడతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్ దంపతులు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం చేపట్టి అనంతరం ఆలయ అర్చకులకు ఉగాది పురస్కారాలతో పాటుగా ముఖ్య అర్చకులకు రూ.10,116 లు, ప్రసంశాపత్రాలు అన్నవరం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ అందజేశారు.



పంచాంగ శ్రవణం పఠిస్తున్న అర్చకులు

చంద్రబాబు, పవన్ సభ విజయవంతం చేయాలి

● రేపు అంబాజీపేట, అమలాపురంలలో బహిరంగ సభలు
● పర్యటనపై సమీక్షించిన నాయకులు

అంబాజీపేట, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ సభను కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడు కోరారు. అంబాజీపేటలోని వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, నిమ్మల రామానాయుడు, కొత్తపల్లి సుబ్బరాయుడులు మాట్లాడుతూ అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గంలోని కూటమి పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో తరలివచ్చేలా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఉమ్మడిపార్టీలు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలోని 68 గ్రామాల్లోని జనసమీకరణ చేసి భారీగా మోటార్‌సైకిళ్లతో ర్యాలీగా సభస్థలానికి చేరుకోవాలన్నారు. తొలుత అంబాజీపేట హైస్కూల్‌లో ఏర్పాటుచేసే హెలిప్యాడ్‌లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పరిశీలించారు. అధినేతలు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగి అక్కడ నుండి అంబాజీపేట- అమలాపురం ప్రధాన రహదారిలో ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అమలాపురంల లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, నాయకులు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, యర్రా వేణుగోపాలరాయుడు, షేక్ సుభాన్, చీకరుమల్లి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు పెదపూడి శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాస్, సుదా బాబ్జి, తోలేటి సత్తిబాబు, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు



భీమేశ్వరాలయంలో ఉగాది పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉగాది ప్రత్యేక పూజలు

● భక్తులతో ఆలయాలు కిటకిట

సామర్లకోట, ఏప్రిల్ 9: క్రోధి నామసంవత్సరం, ఉగాది, కొత్తసంవత్సరం మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం, పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు, అంజిబాబు తదితరులచే ముందుగా భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం నంది మండపంవద్ద ఈవో నీలకం ఠం తదితర భక్తుల నడుమ ఉగాది పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం సీతారామచంద్ర స్వామి ఆలయ పండితులు బృందావనం వెంకట రమణమూర్తిచే పంచాంగ శ్రవణం నిర్వహించి ఆయా రాశుల వారికి పంచాంగ ఫలాలను వివరించారు. ఆలయ ఈవో నీలకంఠం పండితులు వెంకటరమణ మూర్తికి పండిత సత్కారం నిర్వహించారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులచే భక్తులకు పంచాంగ ప్రతులను అందజేశారు. ఈవో ఉగాది పచ్చడిని పలువురికి అందజేశారు. ఈ పూజలలో జనసేన నాయకులు బిక్కిన రాజశేఖర్ దంప తులు తదితర ఆలయ సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో 600 మంది భక్తులకు, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం వెలుపల సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

వసంతనవరాత్ర మహోత్సవాలు పురష్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి వసంత నవరాత్ర మహోత్స వాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు నంది మండపంవద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులు, బిక్కిన రాజశేఖర్ దంపతులు ఆశీనులయ్యి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశేష కుంకుమార్చన పూజలలో కూరగాయల గొల్లబాబు అనిత దంపతులు, కుసుమంచి శేషగిరిరావుపావని దంపతులు, కుసుమంచి శ్యామ్ కుమార్‌హారిక దంపతులు ఆశీనులయ్యారు. పూజల అనంతరం ప్రసాదవితరణ నిర్వహించారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

● సింహ వాహనంపై విహరించిన శ్రీవారు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9:వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. చతుర్వేద పారాయణం, ద్రవిడ వేద పారాయణంలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా కాల్పుల నడుమ గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తీరు వీధుల్లో విహరించారు. చంగోలం పారాయణం, పరమపదోత్సవం, నీరాజన మంత్రపుష్పంలతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి చెందాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వెంకటేశ్వరరావు(80) పోక్సో కేసులో 20 ఏళ్ల శిక్షపడి గతేడాది అక్టోబరు 10న విజయవాడ జైలు నుంచి ఇక్కడికి వచ్చాడు. వయసు రిత్యా రుగ్మతలవల్ల ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతుండగా పలుమార్లు వైద్యం అందించారు. శ్వాస తీసుకో వ డంలో ఇబ్బంది ఏర్పడడంతో గతనెల 27నుంచి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. గుండెపోటు రావడంతో సోమవారం మృతి చెందాడని జైలు అధికారులు పేర్కొన్నారు.

పూజారినని.. దోచుకున్నాడు..!

● కరపలో అమ్మవారి ఆభరణాలతో పరార్



సీసీ పుటేజ్ ద్వారా గుర్తించిన దొంగ పూజారి చిత్రం

వాకాడ (కరప), ఏప్రిల్ 9: పూజారినని నమ్మించి అందినకాడికి దోచుకున్న ఘరానా మోసగాడి ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ గ్రామంలో జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బాబాజీశర్మ అనే వ్యక్తి గత ఏడాదిన్నర నుంచి పూజారిగా పనిచేస్తున్నాడు. పశ్చిగోదావరిజిల్లా పసలపూడి గ్రామానికి చెందిన బాబాజీశర్మ పూజారి విధుల నుంచి తప్పుకోవడంతో గ్రామపెద్దలు మరో పూజారి కోసం బ్రాహ్మణ సంఘం పెద్దలను సంప్రదించారు. ఇదిలావుండగా కృష్ణచైతన్య అనే వ్యక్తి మార్చి 28న గుడికి వచ్చి పూజారిగా విధులు నిర్వహిస్తానని నమ్మబలికి రూ.5వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున గుడికి వచ్చి సంప్రోక్షణ, స్వామి అమ్మవార్లకు పూజాధికాలు నిర్వహించి దూపదీప నైవేద్యం సమర్పించాడు. పాత పూజారి సమక్షంలో గర్భగుడిలోని అమ్మవారి బంగారు ఆభరణాలు ఉండే లాకర్‌ను తెరిచి రికార్డు ప్రకారం అన్నీ సరిచూసుకున్నాడు. తాను కాకినాడ గాంధీనగర్‌లో ఉంటున్నానని, ఇక్కడకు వచ్చేస్తానని, గ్రామంలో పూజారి కోసం ఎప్పుడూ కేటాయించే ఇంటిని శుభ్రంచేయాలని పెద్దలకు సూచించాడు. ఈ ఇంట్లోకి అవసరమైన సామాన్లు కొనుగోలు చేసుకోవడానికి రూ.20వేలు నగదు, ఒక స్కూటీని తీసుకుని అదేరోజు వెళ్లిపోయి నాలుగు రోజులైనా తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన గ్రామస్తులకు సదరు వ్యక్తి సెల్‌కు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కంగారుపడిన ఆలయకమిటీ పెద్దలు లాకర్ తెరిపించి చూడగా అమ్మవారికి చెందిన 28గ్రాముల వివిధ ఆభరణాలు కనిపించలేదు. దీంతో మోసపోయామని గుర్తించిన గ్రామస్తులు నిందితుడి ఆచూకీ కోసం గాలించారు. ఈ ఘరానా మోసగాడు కరపలోని ఒక ఫర్నీచర్ షాపు వద్దకు వెళ్లి వాకాడ శివాలయం పూజారిగా పరిచయం చేసుకుని రూ.5వేలు విలువచేసే గ్యాస్ స్టౌ, కుక్కర్, తదితర సామాన్లు కొనుగోలుచేసి మళ్లీ వచ్చి డబ్బులిస్తానని వెళ్లిపోయాడు. అయితే ఆ డబ్బుల కోసమని వాకాడ గుడికి వచ్చిన ఫర్నీచర్ షాపు యజమాని జరిగిన విషయం తెలుసుకుని షాపు వద్ద ఉన్న సీసీ టీవీ పుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించారు. ఆలయకమిటీ సభ్యులు అడబాల సూర్యప్రకాశరావు, వెలుగుబంట్ల వీరవెంకటసత్యనారాయణ, గ్రామదేవత ముసాలమ్మతల్లి గుడి కమిటీ చైర్మన్ అడబాల బుచ్చిబాబులు మంగళవారం కరప పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసి నిందితుడి ఫొటోలను అందజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్సీలో ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



'ఆస్తికలు' నాటికలోని ఒక సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై 24వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ, సీఆర్సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి ప్రారంభించారు. రాత్రి ఏడు గంటలకు గంగోత్రి పేదకాకాని వారి 'అస్తికలు' నాటికను ప్రదర్శించారు. దీనికి నాయుడు గోపి దర్శకత్వం వహించగా.. రచన పిన్నమనేని మృత్యుంజయరావు, సంగీతం రమణ, మేకప్ పి.రమేష్, రంగాలంకరణ ఎల్.అనిల్‌కుమార్. కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పండు క్రియేషన్స్ ఒంగోలు వారి 'పక్కింటి మొగుడు' హాస్య నాటికను ప్రదర్శించారు. బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించగా.. రచన గోవిందరాజుల నాగేశ్వరరావు, సంగీతం రమణ, రంగాలంకరణ, ఆహార్యం పాటిబండ్ల కమలాకర్. కళాకారులు అభిమానులను కడుపుబ్బా నవ్వించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన ఆశపు నాగజ్యోతి(33)కి నగరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన ప్రభుసాగర్‌కి 2016లో వివాహం జరిగింది. జ్యోతి సోమవారం రాత్రి నిద్రించి మంగళవారం ఉదయం మేల్కోలేదని ఆమె తల్లిదండ్రులకు ప్రభుసాగర్ ఫోన్ చేశాడు. దీంతో హుటాహుటిన వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె మృతదేహం చూడగా మెడపై కమిలిన చారలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకుని ప్రభుసాగర్‌ని ప్రశ్నించారు. సోమవారం ఆమెతో గొడవ జరగడంతో ఉరి వేసుకుందని ప్రభుసాగర్ చెప్పినట్టు తెలుస్తోంది. తన కూతురిని గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆ గొడవల నేపథ్యంలో ఆమె హత్యకు గురై ఉంటుందని తండ్రి వెంకటేశ్వర రావు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ పేర్కొన్నారు.

పరిణితి చెందిన కొబ్బరికాయల కొనుగోలుకు
కేంద్రం గ్రీన్‌సిగ్నల్

● క్వింటా రూ.3,013 వంతున నాఫెడ్ ద్వారా కొనుగోలు

అంబాజీపేట, ఏప్రిల్ 9: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు పరిణితి చెందిన కొబ్బరి కాయలను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రైతులవద్ద పరిణితి చెందిన కొబ్బరి (ముక్కుడు) కాయలు, పిలకకాయలకు, బోడకాయలకు రూ.3,013 వంతున కొనుగోలు చేసేందుకు మద్దతు ధర ప్రకటించింది. దీనికి సంబంధించి గత నెలలో భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్యదర్శి అజిత్‌కుమార్‌సింగ్ జీవో జారీ చేసినట్లు సమాచారం. ఈ కొనుగోలు బాధ్యతను నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌లకు అప్పగించింది. వీటి ద్వారా రైతులవద్ద నేరుగా వలిచిన కొబ్బరికాయలను క్వింటాళ్ల వంతున కొనుగోలు చేస్తారు. వీటిని అనంతరం ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ కంపెనీ (ఎఫ్‌పీవో)లకు విక్రయించి వాటి ద్వారా కోప్రా తయారు చేయించుకుని వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. దీని ద్వారా కొబ్బరి రైతులకు కొంతమేర ఉపశమనం పొందవచ్చు. రైతుల వద్ద నిల్వఉన్న కాయలను కొనుగోలు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

దుళ్లలో ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు

● మురమండ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



మురమండ-దుళ్ల నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి విజేతకు మెమెంటో, నగదు

కడియం, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కడియం మండలం మురమండ-దుళ్ల రోడ్డులోని నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు మంగళవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 200 కిలోల బరువుతో 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్ ఎడ్లు ప్రథమ స్థానాన్ని, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ద్వితీయ స్థానం, గోకవరం మండలం ముల్లేరు మల్లవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీను ఎడ్లు తృతీయ స్థానం, మురమండకు చెందిన కురసాల లలితేష్ ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు కన్సోలేషన్ బహుమతిగా జ్ఞాపికలు అందించారు. న్యాయనిర్ణేతలుగా మురమండకు చెందిన మొగలపు వెంకటరామకృష్ణారావు, వై.రమేష్‌లు వ్యవహరించారు. మొగలపు హరిశ్చంద్ర ప్రసాద్, వట్టికూటి జానకీరామ్, కొరపాటి చిన్నా, ముత్యాల సత్యనారాయణ ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్
రాష్ట్ర డైరెక్టర్ పదవికి భద్రయ్య రాజీనామా



పసలపూడి భద్రయ్య

పెరవలి, ఏప్రిల్ 9: వైసీపీ నాయకుడు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కుమ్మరి శాలివాహన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తూర్పుగోదావరి జిల్లా పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్య రాష్ట్ర డైరెక్టర్ పదవికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 10న నిడదవోలులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరనున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదని, ముఖ్యంగా బీసీలకు చేసిం దేమి లేదని విమర్శించారు. గతంలో తాను టీడీపీలో చాలాకాలం ఉన్నానని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందని, అందువల్ల తాను సొంతగూటికి చేరుతున్నట్టు ప్రకటించారు.

జాతీయస్థాయిలో చందుకు కాంస్య పతకం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 9: కర్నాటకలోని దేవగిరిలో జరిగిన 27వ జూనియర్ నేషనల్ సపక్‌తక్రా చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన మంచాల చందు ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని దక్కించుకున్నట్టు కోచ్‌లు యాండ్ర గౌతమ్, కేతా సతీష్ తెలిపారు. చందును అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సైదులు రమణ, జీవీ బాబు, ఫిజికల్ డైరెక్టర్లు కేవీఎస్ ప్రసాద్, బూల చిరంజీవి, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన చందును అభినందిస్తున్న దృశ్యం

కోడిపందాల స్థావరంపై దాడి

రంగంపేట, ఏప్రిల్ 9: మండలంలోని వడిశలేరు గ్రామ శివారులో మంగళవారం కోడి పందాల స్థావరంపై తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడికత్తులు, రూ.2290 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు శ్రీకారం

ఏలేశ్వరం, ఏప్రిల్ 9: శ్రీరామ నవమి వేడుకలకు మండల వ్యాప్తంగా శ్రీకారం చుట్టారు. మంగళవారం పట్టణంలో వల్లపువీధి, దిబ్బలపాలెం రామాలయాల వద్ద పందిరి రాట వేశారు. ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఏటా ఉగాది రోజున నవమి వేడుకలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కమిటీ సభ్యులతో పాటు మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ముహూర్తం చేశారు.

పవన్‌కల్యాణ్ గెలుపును అడ్డుకోలేరు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 9: పిఠాపురం నియోజకవర్గంలో అధికార వైసీపీ ఎన్నివేల కోట్లు ఖర్చు పెట్టినా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపును అడ్డుకోలేరని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పవన్‌ను కలిసిన అనంతరం మంగళవారం వర్మ మీడియాతో మాట్లాడుతూ వైసీపీపై సంచలన ఆరోపణలు చేశారు. అధికారుల దృష్టిని మరల్చి పిఠాపురం, తుని నియోజకవర్గాలకు డబ్బుల మూటలను తరలించారని ఆరోపించారు. ప్రచార సామాగ్రి ఉన్న వేన్ దొరికిపోయేలా చేసి, అధికారులు అందులో నిమగ్నమై ఉండగా సొమ్ములను తరలించినట్లు చెప్పారు. టీడీపీ జనసేన కలిసి పని చేస్తున్నాయని, వైసీపీని పరుగెత్తించడం ఖాయమని తెలిపారు. ఎంతమంది మిథున్ రెడ్లు వచ్చినా పవన్ గెలుపును ఆపలేరని, ఇప్పటికే ప్రజలు పవన్‌కు ఓటు వేయాలని నిర్ణయించుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పవన్ పర్యటించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో ఇక్కడ ప్రచారం ఎలా నిర్వహించాలి తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఆయన కూడా ఒక టీమ్‌ను తనకు అటాచ్ చేశారని తెలిపారు. పవన్‌కు భారీ మెజార్టీ తీసుకువచ్చే విధంగా టీడీపీ కేడర్ అంతా కసిగా పనిచేస్తున్నదని చెప్పారు.

'రాష్ట్రాభివృద్ధి కోసం గెలిపించండి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9: ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో ప్రజల నుంచి దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో అడ్డగోలుగా గెలవాలని చూస్తున్నారని, రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 50వ డివిజన్‌లో కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లకు మద్దతుగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. వారు మట్లాడుతూ రూ.12 లక్షల కోట్లు సీఎం జగన్ అప్పులు చేసి, కేవలం 2 లక్షల కోట్లు రూపాయలు మాత్రమే ప్రజలకు పంపిణీ చేసి, మిగిలిన కోట్లాది రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), మాజీ కార్పొరేటర్ పలివెల త్రిమూర్తులు, గాయత్రి, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు,బొజ్జ పాల్గొన్నారు.

'వలంటీర్ల జీవితాలతో ఆడుకుంటున్న వైసీపీ'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 9: తమ స్వార్థ రాజకీయాల కోసం వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించి వారి జీవితాలతో వైసీపీ నాయకులు ఆడుకుంటున్నారని కాకినాడ టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడ 6వ డివిజన్‌లో కొండబాబు ప్రచార కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ వలంటీర్లకు వేతనం పెంపుపై చంద్రబాబు తీపి కబురు చెప్పారన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు జగన్, నాగరాజు, నాని, శ్రీను, సత్యనారాయణ ప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు. నగరంలో 31, 34 డివిజన్‌లకు చెందిన జీరి రాజశేఖర్‌రెడ్డి (బుజ్జి), ఆయన అనుచరులు కొండబాబు సమక్షంలో టీడీపీలో చేశారు. చేరిన వారిలో సుబ్బుమల్లి, కాలపు రెడ్డి బాలాజీ, జీరి కుమార్, పొంగా తాడి, తోటకూర ఎర్ర అబ్బాయి తదితరులున్నారు. వనమాడి ఇంట ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.

'వైసీపీని ప్రజలంతా ఓడించాలి'

తాళ్లరేవు, ఏప్రిల్ 9: భూకబ్జాలు, అవినీతి, అక్రమాల వైసీపీని ప్రజలంతా ఓడించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు కోరారు. మంగళవారం సాయంత్రం చొల్లంగి టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పులపకూర త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు ఆశించిన ప్రజాస్వామ్య పాలన అందిస్తామన్నారు. దుర్మాగపు వైసీపీ పాలనకు స్వస్తిచెప్పి తెలుగుదేశం పార్టీను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాశి గోవిందు, మేడపాటి దేవానందం, కొంకి రమణ, కాశి చినబాబు, కనకాల సిద్ధిశేషారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఏలూరు మాజీ సర్పంచ్ చేరిక

ప్రత్తిపాడు, ఏప్రిల్ 9: ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నేత జాని మాణిక్యంతో పాటు ఆయన అనుచరులు పెద్ద ఎత్తున వైసీపీకి రాజీనామాలు చేసి ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారిలో జాని హనుమంతు తదితరులన్నారు. ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద సత్యప్రభ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ప్రత్తిపాడు గ్రామ ఆర్యవైశ్యపెద్దలకు పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. ధర్మవరానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్యప్రభకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి తమ్మయ్యబాబు, బీజేపీ నేత ఉమ్మడి వెంకట్రావు, టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, కృష్ణబాబు, కొప్పుల సత్యనారాయణ, బొండాడ నారాయణ,బొల్లు వెంకటేశ్వరరావు ఉన్నారు.

జనసేనలో చేరికలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9: కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం సూర్యారావుపేట పార్టీ నాయకులు సూరాడ అప్పాజీ, దోనె రమణల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సూరాడ తాతబాబు నాయకత్వంలో సుమారు 30 మంది జనసేనలో చేరారు. రమణయ్యపేటలో రాష్ట్ర పార్టీ జాయింట్ సెక్రటరీ తాటికాయల వీరబాబు ఆధ్వర్యంలో బాపన్నదొరకాలనీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 100 మంది పార్టీలో చేరారు. వారికి కాకినాడ రూరల్ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

వెంకటప్రసాద్‌కు జిల్లాస్థాయి ఉత్తమ పురస్కారం

ఏలేశ్వరం, ఏప్రిల్ 9: వైకానస ఆగమశాస్త్రాన్ని చాటిచెబుతూ అర్చకత్వాన్ని నిర్వహిస్తున్న వింజరపు వెంకటప్రసాద్ సేవలకు గుర్తింపు లభించింది. లింగంపర్తి శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న ఆయన ఉగాది పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ పురస్కారానికి అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం కాకినాడ సూర్యకళామందిర్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులినారాయణమూర్తి నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.10116 నగదు అందుకున్నారు. వెంకట్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక బావాలను అలవర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన్ని శ్రీరాజవేణుగోపాలస్వామి వంశపార్య ధర్మకర్త అవసరాల కిషోర్, వింజరపు గోపీ కుటుంబ సభ్యులు అభినందించారు.

వేద పండితుడికి సన్మానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 9: మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి ఆలయంలో మంగళవారం వేద పండితుడు తొయ్యేటి పాపారావుకు గ్రామపెద్దలు ఘన సన్మానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మినరసింహాచార్యులు, వీర వెంకట విజయదుర్గ నాట్యమండలి సానానూకరాజు నాయుడు, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇంధన ఏసుబాబు వేద పండితుడు తొయ్యేటి పాపారావును ఘనంగా సన్మానించారు. తొలుత వేద పండితుడు పాపారావు పంచాంగ శ్రవణం నిర్వహించారు. బొల్లు రాజబాబు, కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

గండేపల్లి, ఏప్రిల్ 9: మండలంలో రామయ్యమ్మపాలెం గ్రామంలో మంగళవారం రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ పోలీసలు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ముగ్గురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.250 నగదు, రెండు కోడికత్తులను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం మురారి, గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

తుని రూరల్, ఏప్రిల్ 9: చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాపార వేత్త సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తులు స్వామి కోరారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని తునిలో లోవ సూర్య ఫౌండేషన్, విజయదుర్గ వ్యాపారసంస్థలు కలిసి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసి వేసవి మూడు నెలలు చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్టు తెలిపారు.

నూకాలమ్మతల్లి జాతర ఉత్సవాలు

కిర్లంపూడి, ఏప్రిల్ 9: కిర్లంపూడిలో వేంచేసిన నూకాలమ్మతల్లి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు కొంగు బంగారమైన నూకాలమ్మతల్లి జాతరకు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తున్నారు. మంగళవారం రాత్రి బాణాసంచా సామగ్రి కాల్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బీసీవై పార్టీ అభ్యర్థిగా సాయికుమార్ యాదవ్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 9: బీసీవై పార్టీ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుండల సాయికుమార్ యాదవ్ ఎంపికయ్యారు. మంగళవారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో సాయికుమార్‌కు టిక్కెట్ లభించింది.

వైభవంగా ఉగాది

- గ్రామాల్లో వేడుకలు, పంచాంగ శ్రవణాలు
- ఏరువాక చేపట్టిన రైతన్నలు
- భక్తులతో కిటకిలాడిన దేవాలయాలు
- నూతన వస్త్రాలతో చిన్నారుల సందడి




పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో పూజలు, ఏలేశ్వరంలో ఉగాది పచ్చడి పంచుతున్న వీహెచ్‌పీ సభ్యులు

పెద్దాపురం, ఏప్రిల్ 9: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో క్రోధి నామసంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించుకున్నారు. స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. రాశులు, వాటి గమనాలు, పంటలు పండే స్థితి, ఈ సంవత్సరం కలిగే ఫలితాలు తదితర విషయాలపై పంచాంగ కర్తలు వివరించారు. అలాగే భవనేశ్వరీ పీఠవ పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న వినాయకుడి ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేపట్టారు. ప్రజలు నూతన వస్త్రాలను ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. షఢ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తిని ఆనందంగా గడిపారు. రైతులు ఏరువాక చేపట్టి నూనత పంట సాగుకు శ్రీకారం చుట్టారు. పలు చోట్ల కవిసమ్మేళనాలు జరిగాయి. బంగారం, నూతన వస్త్రాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు.

సామర్లకోట: సామర్లకోట మాండవ్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో సామర్లకోట రైతు సంఘం ఆధ్వర్యంలో పండితులతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ బాపినీడు ఆశీలనులై ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వచనాలు పొందారు. పండితులు సీహెచ్.హనుమంతు క్రోధినామసంవత్సర పంచాంగ ఫలితాలను రైతులకు సమగ్రంగా వివరించారు. అనంతరం రైతులకు పంచాంగప్రతులు, ప్రసాదాలు, శీతలపానీయాలు అందజేశారు. రైతుసంఘం ప్రతినిధులు కంటే బాబు, యార్లగడ్డ బాపినీడులచే పండిత సత్కారం నిర్వహించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: అశోక్‌నగర్‌లో టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పంచాంగ శ్రవణం నిర్వహించారు. కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ, ప్రభాకర్‌లు పంచాంగ శ్రవణం పుస్తకాలు పంపిణీ చేశారు. ఉమ్మడి పార్టీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రాందేవు సీతయ్యదొర, గుడ్ల అప్పారావు, కౌజు నెహ్రూ, వేటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, వెంకటలక్ష్మి, యజ్జల బాబ్జీ పాల్గొన్నారు. కాకినాడ రూరల్ వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలను రూరల్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలో గల సుమారు 300 మంది పురోహితులు,వేద పండితులను సత్కరించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రసాద్ సౌజన్యంతో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరావు, ఆర్ బాపిరాజు, రాఘవరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంతో పాటు శివాలయం, విష్ణులయం, వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. రామవరం వెళ్లే రోడ్డులో శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద పిల్లి శ్రీను బ్రదర్స్ ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణమండపం నందు ఆర్యవైశ్య సేవా సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, బీటెక్ యూత్ సంయుక్తం గా నిర్వహించిన కార్యక్రమానికి జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన వారికి జగ్గంపేట వైనాట్ షోరూమ్ బహుమతులు అందజేశారు. కె.నర్సింహమూర్తి పంతులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడి, చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కొత్త భైరవకృష్ణ, బొండా నూకబాబు, పాలకుర్తి సురేష్, కొత్త సుధీర్, మానేపల్లి బంగ్రాజు,కొత్త రాము ఉన్నారు.

ఏలేశ్వరం: మండలంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, షిర్డిసాయి, సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పురోహితులు కోడూరి మహేష్, శేఖర్, సాయి పూజలు నిర్వహించారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను దర్శించి ఉగాది పచ్చడిని ఆరగించారు. పాత బస్‌స్టాండ్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని ప్రజలకు పంచారు. గట్టెం వెంకటరమణ, అలమండ దుర్గా ప్రసాద్, తూరౌతు గురవయ్య, ఉడతల రమణారావు, గొల్లపూడి సత్యనారాయణ, కటకం కిరీటి, పాబోలు దేవి, గొల్లపూడి మహాలక్ష్మీ, మల్లేశ్వరి, ఇందిర, సూర్యకుమారి, పాల్గొన్నారు. దిబ్బలపాలెం రామాలయం వద్ద లింగంపర్తి శ్రీరాజగోపాలస్వామి దేవస్థానంలో సత్యరామగోపాల్ వేదపండితులు పంచాంగవిశేషాలు వివరించారు.

తునిరూరల్: తేటగుంటలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ కార్యకర్తలతో కలిసి రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు కుటుంబ సమేతంగా ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. వేద పండితులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యకర్తలు యనమలను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), టీడీపీ యువ నేత యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించి పూజలు చేశారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికి మంచి జరగాలని ప్రార్థించినట్టు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

కోటనందూరు: మండలంలో రైతులు తెల్లవారు జాము నుంచే పొలాల్లోకి వెళ్లి కొత్త పనులు ప్రారంభించారు. మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల వద్ద పంచాంగ శ్రవణం జరిగింది. మండలంలో కోటనందూరు, కెఇచిన్నయ్యపాలెం, జగన్నాధపురం, ఎస్ఆర్‌పేట, బిళ్లనందూరు, బొద్దవరం, కాకరాపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

కరప: మండల గ్రామాల్లో మహిళలు ఉదయాన్నే లేచి షఢ్రుచుల మేళవింపుతో ఉగాది పచ్చడిని తయారుచేసి కుటుంబసమేతంగా ఆరగించారు. సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కరప వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆయా ఆలయాల్లో వేదపండితులు పంచాంగ పఠనం చేశారు. చిన్నారులు ఉగాది పచ్చడిని పంచిపెట్టారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలను దర్శించుకున్నారు. ఉగాది పచ్చడిని పంచారు. రౌతులపూడిలో పద్మనాభ కమ్యూనిటీహాల్ నందు టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు పంచాగ శ్రావణం నిర్వహించారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు పట్టణం, మండలపరిధిలోని ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తాటిపర్తిలోని అపర్ణాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చనలు జరిగాయి. గొల్లప్రోలులోని శివాలయం, విష్ణాలయం, కనకదుర్గ ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

తొండంగి: ఏవినగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. ఏ.కొత్తపల్లి కదంబ వనవాసిని సంస్థానంలో వేడుకలు జరిగాయి. భువనేశ్వరి సహిత విజయేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం జరిగింది. గ్రామంలోని బుచ్చమ్మ పేరంటాలు అమ్మవారి కావిళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తాళ్లరేవు: ఉగాది సందర్భంగా పి.మల్లవరంలో సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీనేత దూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు ఆలయకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గండేపల్లి: మండలంలో ఆలయాల్లో ప్రత్యేకపూజలు, పంచాగశ్రవణ కార్యక్రమాలు జరిగాయి. గండేపల్లి, మల్లేపల్లిలో ఆలయాల్లో పంచాంగ శ్రవణం పురోహితుడు సత్తిబాబు భక్తులకు చదివి చెప్పారు.

కిర్లంపూడి: కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి సాయంత్రం పంచాంగ శ్రవణం వినిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.


పిఠాపురం టీడీపీ కార్యాలయంలో వేడుకల్లో వర్మ


కోటనందూరు:కెఇచిన్నయ్యపాలెంలో పంచాంగ శ్రవణం


సర్పవరం జంక్షన్: ఉగాది వేడుకల్లో నానాజీ, బాబీ


సామర్లకోట:పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పండితులు


జగ్గంపేట: ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు


గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీలో వణుకు

- పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప
- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన నాయకులు


పెద్దాపురం మండలంలో టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే చినరాజప్ప


తాళ్లరేవు మండలం చొల్లంగిలో బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరికలు


జగ్గంపేట: తెలుగుదేశం పార్టీలో చేరినవారితో జ్యోతుల నెహ్రూ

పెద్దాపురం, ఏప్రిల్ 9: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీలో వణుకు ప్రారంభమైందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన టీడీపీలో చేరికలు కార్యక్రమంలో ఆయన పార్టీలో చేరినవారికి చినరాజప్ప కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎప్పుడూ తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పార్టీల్లో చేరేవారికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. వైసీపీ అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచన చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అండగా నిలవాలని కోరారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై రాజప్ప అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో టీడీపీ నేతలు ఎలిశెట్టి నాని, మేడిది శ్రీనివాస్, కర్రి వెంకటరమణ, గోలి వెంకటఅప్పారావు చౌదరి, సానిపిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణ పరిధి చిన్నివీదికి చెందిన రామాలయం పానిపిని అబ్బాయి ఇంటివద్ద మంగళవారం సానిపిని సంధ్యారాణి, పచ్చిగోళ్ళ మంగతాయారు, చుండ్రు రామలక్ష్మి తదితర 30 మంది మహిళలు టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు, నిమ్మకాయల రంగనాగ్ తదితర పట్టణ టీడీపీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరై సంధ్యారాణి తదితర మహిళలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని, సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతోమేలు చేకూరుస్తుందని చెప్పారు. మహిళలకు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికాభివృద్ధి చెందేవరకూ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని రాజప్ప చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

తాళ్లరేవు: వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలను తట్టుకోలేక విసుకుగుచెంది 200కుటుంబాలు టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. బుచ్చిబాబు మాట్లాడుతూ చొల్లంగి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి అన్నివర్గాలకు అభివృద్ధిని పంచుతానన్నారు. విస్సాకుల రాజేంద్రప్రసాద్, రాణి, పులపకూర ముసలయ్య, దుర్గారావు, బొడ్డు అన్నవరం, దుర్గాప్రసాద్, బుజ్జిబాబు, దడాల సత్యనారాయణ, దడాల రాజేశ్వరి, బొమ్మితి చినబాబుకు బుచ్చిబాబు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గర్రే లక్ష్మీనారాయణ, గండి శ్రీను, పులపకూర త్రిమూర్తులు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, జనసేన మండలాధ్యక్షుడు అత్తిలి బాబూరావు, పుణ్యమంతుల సత్తిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట: కృష్ణుడిపాలెం, కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామాల నుంచి, చిన్నూరు గ్రామంలో యువ నాయకులు సోమిశెట్టి సత్తిబాబు, ఈదల వీర్రాజు చౌదరి, కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామాల నుంచి కలగా రాజ చక్రవర్తి, రామిశెట్టి శ్రీను, నీటిపల్లి శ్రీను, చాగంటి సురేష్, రామిశెట్టి మణికంఠ, తదితరులు వైసీపీని వీడి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలతో ఆయన సాదరంగా ఆహ్వానం పలికారు. నెహ్రూ మాట్లాడుతూ నియోజవర్గానికి మొదటి బూత్ అయిన కృష్ణుని పాలెంలో అధిక మెజార్టీతో ఈ సారి ఎన్నికలలో స్వాగతం పలకడం కోసం సంసిద్ధంగా ఉందన్నారు. కృష్ణవరం గ్రామం నుంచి టీడీపీ చేరికతో జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి విజయం తథ్యమని, ఇంకా అనేక మంది పార్టీలోకి చారతారన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట మండల కన్వీనర్ మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, కృష్ణునిపాలెం ఉపసర్పంచ్ కిషోర్, కాకినాడ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బోదిరెడ్ల సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జి మండిగ బాలాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోకవరం మండలం మీడియా కోఆర్డినేటర్ కొంగరపు రాజు, బూత్ ఇన్‌చార్జ్ అండుబోయిన గోవిందరాజు, నక్కన దుర్గారావు,సేనాపతి సత్తిబాబు, చందక రాఘవ, కరణం సుబ్బారావు, అబ్బిరెడ్డి సన్యాసి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 9: ధర్మవరం, ప్రత్తిపాడులలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ధర్మవరం నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆధ్వర్యంలో ఆదర్శ విద్యాలయం పర్యవేక్షణలో నిర్వహించి పోటీల్లో సీనియర్స్‌లో జువ్వల దేవి, బొల్లు వెంకటలక్ష్మి, బొల్లు హేమనాగలక్ష్మి, జూనియర్స్‌లో ఎం.సురేఖ, కరణం జానకి, యడగాల ఉమాదేవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వారికి దొడ్డిపట్ల సోమన్నదొర, దాడి చిన్నారావు, దాడి వెంకటలక్ష్మి బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పి.రమాదేవి, ఎంవీ అన్న పూర్ణ వ్యవహరించారు. అలాగే ప్రత్తిపాడు మున్సిబ్ వారి రామాలయం వద్ద కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

'పటిష్ట నిఘాతో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు రవాణాకు అడ్డుకట్టవేసేందుకు పటిష్ట నిఘాతో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశించారు. మంగళవారం సర్పవరం జంక్షన్‌లో తహశీల్దార్ కార్యాలయంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురి చేయకుండా చేసేందుకు వీలుగా నగదు, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేలా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తక్షణం చర్యలు తీసుకోవాలని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా పనిచేసేలా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో తహశీల్దార్ బి.విజయప్రసాద్, ఎన్నికల డీటీ సురేష్ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

శ్రీ శత చండీయాగపూజలు


విశేష పూజల్లో స్వయంవరపార్వతి అమ్మవారు

సామర్లకోట, ఏప్రిల్ 9: వసంత నవరాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం చెంతన ఉన్న విద్యా మందిరంలో స్వయంవరపార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామికి శ్రీశత చండీయాగ మహోత్సవ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు చంద్రాభట్ల గణపతిశాస్త్రి సోదరుడు చంద్రాభట్ల పతంజలి,పద్మ దంపతులచే అమ్మవారికి విశేష పూజలు చేశారు. యాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణం, గోపూజ, అకండ దీపారాధన, అంకురార్పణ, మండపారాధన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకపూజలు, చండీపారాయణం, సూర్యనమస్కారాలు, గణపతి, సూర్య, విష్ణు, రుద్ర, దుర్గాదేవతల జపములు, రామాయణ పారాయణ మహావిద్యపారాయణలు,చండీహోమం, శతరుద్రియ హోమాలు, నవగ్రహ సహిత నక్షత్ర హోమపూజలు చేసి ప్రసాదాలు అందజేశారు.

కామధేను మహాయజ్ఞం



ప్రత్తిపాడు, ఏప్రిల్ 9: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సురభి కామధేను మహాయజ్ఞం నిర్వహించారు. అరుణాచలేశ్వరునికి మహాన్యాస పూర్వక ధాన్యాభిషేకం నిర్వహించారు. కామధేనుమహాయజ్ఞంలో ఆవుపేడతో తయారు చేసిన 1లక్ష 8వేల పిడకలు, 250కిలోల ఆవునెయ్యి, 21 ఔషదాలతో తయారు చేసిన 250 కిలోల గోమపు పొడి 9 రకాలలతో కూడిన టన్ను సుగంధ ద్రవ్యాలను వినియోగించారు. ఈ యజ్ఞంలో దంపతులు,నూతన వధువరులు, కన్యలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామి అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ధర్మాన ధర్మారావు దర్శించుకున్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 9: రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్ కాలనీ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఉప్పాడ కొత్తపల్లికి చెందిన పెంటపాటి జయబాబు (35) కాకినాడ పిండాలచెరువు సమీపంలోని డీసీసీబీ బ్యాంకు శాఖలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తుంటాడు. అయితే అతడు యానాంలో వివాహ కార్యక్రమానికి సోమవారం సాయంత్రం వెళ్లి తిరిగి అర్ధరాత్రి వస్తుండగా డ్రైవర్స్ కాలనీ వద్ద తన బైక్‌కు ఆవు అడ్డు రావడంతో ప్రమాదం జరిగి తలకు బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.